క్లుప్తంగా

162 మందికి కంటి వైద్య పరీక్షలు

తగరపువలస : జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక శ్రీలక్ష్మి విజయ ఆస్పత్రి వద్ద నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 162 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 60 మందికి శస్త్ర చికిత్సలు అవసరం కాగా శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాస రెడ్డి, శంకర్ ఫౌండేషన్ వైద్య సిబ్బంది జాక్సన్, కో ఆర్డినేటర్ వై.రాజు, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

నీటితోనే జీవరాశి మనుగడ

తగరపువలస : భూమిపై జీవరాశి మనుగడకు నీరు, మొక్కలు అత్యంత అవసరమని దివీస్ లేబొరేటరీ జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వర రావు అన్నారు. తూడెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు నీరు, మొక్కల ఆవశ్యకతపై శనివారం అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకాన్ని బాధ్యతగా తీసుకుని పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఈసీడీ విభాగ మేనేజర్ ప్రసాద్, సీఎస్సార్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, సిబ్బంది ఎ.శ్రీనివాస్, కె.నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

భక్తితో శనిత్రయోదశి పూజలు



నవగ్రహ మండపం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

పీఎం పాలెం : శని త్రయోదశిని పురస్కరించుకుని భక్తులు శివాలయాల్లో శనివారం గ్రహ శాంతి పూజలు చేశారు. స్థానిక ఆలయ ప్రధాన అర్చకులు ప్రదీప్ శర్మ పర్యవేక్షణలో నవ గ్రహాలకు నవ దినుసులు నైవేద్యంగా సమర్పించారు. శనిదేవునికి తైలాభిషేకాలు చేశారు. బక్కన్నపాలెం రోడ్డులోని శ్రీ శృంగేరీ శంకర మఠం వద్ద నవ గ్రహాలకు భక్తులు పూజలు చేశారు.

చక్రం ఊడి నిలిచిపోయిన బస్సు



పద్మనాభంలో నిలిచిపోయిన బస్సు

పద్మనాభం: సింహాచలం నుంచి విజయనగరం శనివారం ఉదయం వెళ్తున్న మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సు మార్గ మధ్యలో పద్మనాభం సచివాలయం వద్దకు రాగానే వెనుక చక్రం ఊడిపోయింది. దీంతో బస్సు ముందుకు కదలలేదు. గమనించిన డ్రైవర్ వెంటనే రోడ్డు పక్కన నిలిపివేశాడు. డ్రైవర్ సకాలంలో స్పందించడంతో ప్రమాదం తప్పింది. బస్సులోని 18 మంది ప్రయాణికులను వెనుక వచ్చిన మరో బస్సులో పంపించారు.

బకాయిలు వసూలు చేయాలి

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్ - 2లో రెవెన్యూ బకాయిలు పూర్తి స్థాయిలో వసూలు చేయాలని జీవీఎంసీ రెవెన్యూ, పబ్లిక్ హెల్త్ ఏడీసీ సన్యాసిరావు ఆదేశించారు. శనివారం ఆయన జోన్‌లో రెవెన్యూ బకాయిలు ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 5 నుంచి 13 వరకు గల వార్డుల్లో రూ.12 కోట్ల బకాయిలున్నాయని, నెలాఖరు లోపు వసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కొందరు సిబ్బందికి ఫోన్ చేసి నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు.

చక్కగా చదివితే ఉజ్వల భవిష్యత్

భీమునిపట్నం : భీమిలిలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవం శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నో మంచి సదుపాయాలు కల్పిస్తోందని... దానికి తగిన విధంగా అందరూ చదువుకోవాలని సూచించారు. చక్కగా చదువుకుంటే అందరికీ మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కళాశాలలో నిపుణులైన అధ్యాపకులు వున్నారని... వారు అందిస్తున్న శిక్షణ సద్వినియోగం చేసుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థిని లక్ష్యం నిర్దేశించుకుని చదివితే అనుకున్నది సాధించవచ్చని సూచించారు. అనంతరం పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు జెడ్పీ ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు ఓటేయండి

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



బాందేవుపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



విలాస్కాన్‌పాలెంలో మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పద్మనాభం: తాము చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలు చూసి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బాందేవుపురం, విలాస్కాన్‌పాలెం గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా, సంతోషంగా వున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజల అంతరాత్మకు తెలుసన్నారు. ఓటర్లు ఆత్మ పరిశీలన చేసుకుని అభివృద్ధి జరిగిందంటేనే ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. రెండు రోజుల్లో ఓ కొత్త వ్యక్తి టీడీపీ టికెట్ తెచ్చుకుని ప్రజల ముందుకు రాబోతున్నారన్నారు. అటువంటి వ్యక్తులు చెప్పిన మాటలు ఓటర్లు నమ్మొద్దని సూచించారు. టీడీపీ పాలనలో ఎమ్మెల్యే ఒక్కసారి కూడా గ్రామాల ముఖం చూడలేదన్నారు. సైకిల్ పని అయిపోయిందని, మూలకు చేరిందని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా అనేకసార్లు గ్రామాల్లోకి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించానన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరించినట్టు తెలిపారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేస్తే విశాఖపట్నం నుంచి పరిపాలన సాగిస్తారన్నారు. దీనివల్ల ఉత్తరాంధ్ర అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. భూముల విలువ అమాంతంగా పెరుగుతుందన్నారు. రూ.2 కోట్లున్న ఎకరం భూమి విలువ రూ.10 కోట్లకు పెరుగుతుందన్నారు. చంద్రబాబును సీఎం చేస్తే అమరావతి రాజధాని అవుతుందన్నారు. అప్పుడు ఉత్తరాంధ్ర వెనుకబడిపోతుందన్నారు.

జన జాతర మధ్య ప్రచారం

అభివృద్ధి, సంక్షేమ పథకాల కోసం బాందేవుపురంలో రూ.25 కోట్లు, విలాస్కాన్‌పాలెంలో రూ.15 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనను ఎమ్మెల్యేగా, బొత్స ఝాన్సీ లక్ష్మిని ఎంపీగా గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. తనను గెలిపిస్తే బాందేవుపురం, విలాస్కాన్‌పాలెం గ్రామాలను మరింత అభివృద్ధి చేస్తానన్నారు. రెండు గ్రామాల్లో ప్రజలు ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు ఘన స్వాగతం పలికారు. జన జాతర మధ్య ఓటర్లకు అభివాదం చేస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. అభివృద్ధి, సంక్షేమంపై ముద్రించిన కరపత్రాలను ఓటర్లకు పంపిణీ చేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, బాందేవుపురం ఎంపీటీసీ సభ్యురాలు బోని సావిత్రి, విలాస్కాన్‌పాలెం సర్పంచ్ నల్లి సత్యవతి, వైఎస్సార్ సీపీ నాయకులు బోని సన్యాసినాయుడు, నల్లి సన్యాసప్పడు, రామసింగు ముత్యాలనాయుడు, బాయి అప్పలస్వామి, సుంకర పైడినాయుడు, వాజీగాని పైడినాయుడు, బోని చైతన్య, సిరుగుడి ఆదినారాయణ, సుంకర బంగారప్పడు, మొకర అప్పలనాయుడు, ఈర్ల ఈశ్వరరావు, బుగత సత్యనారాయణ, జి.వి.కె.కె.వర్మ, గొంత్రిపాటి పెద ఎర్రినాయుడు, మరగడ అప్పారావు, కోన రమణ, మామిడి శివరామకృష్ణ, సీర సూరప్పడు, మాదిరెడ్డి భాస్కరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి ముగ్గురు అమ్మవార్ల ఆలయ వార్షికోత్సవాలు



సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయంలో ఏర్పాటు చేసిన క్యూ లైన్లు



పోలమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న పల్సర్ బైక్ ఝాన్సీ, రమేష్

తగరపువలస : సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయ వార్షికోత్సవాలు ఆదివారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా దేవదాయశాఖ సిబ్బంది ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయం నుంచి జాతీయ రహదారికి ఇరువైపులా విద్యుత్ దీపాలతో అలంకరణ పూర్తి చేశారు. భక్తులు క్యూ లైన్లలో అమ్మవార్లను దర్శించుకునేందుకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. భక్తులు వాహనాలను సర్వీస్ రోడ్డుపై కాకుండా ఆలయాన్ని ఆనుకుని నిలిపేందుకు వీలుగా పార్కులో పార్కింగ్ ఏర్పాటు చేశారు. క్యూ లైన్లు కూడా పార్కు నుంచి నేరుగా ఆలయం వద్దకు ఏర్పాటు చేశారు. తాగునీరు, ప్రసాదాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అనువు సందర్భంగా మంగళవారం ఆలయం వద్ద రద్దీ ఎక్కువగా వుంటుంది. ఈ నెల 31న ఆలయ ఆవరణలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం పల్సర్ బైక్ ఝాన్సీ, ఆమె గురువు రమేష్ అమ్మవార్లను దర్శించుకున్నారు. తరచూ విజయనగరం, శ్రీకాకుళం ప్రోగ్రాంలకు వెళ్తూ అమ్మవార్లను దర్శించుకుంటున్నట్లు వారు తెలిపారు. అర్చకుడు ఏడిద రామకృష్ణ శర్మ వారికి అమ్మవారి దర్శనాలు కల్పించారు.

అవగాహనతోనే క్షయ నియంత్రణ సాధ్యం



మధురవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మధురవాడ : క్షయ వ్యాధిపై అంతా అవగాహన పెంచుకోవాల్సిన అవసరం వుందని మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.ప్రశాంతి చెప్పారు. మార్చి 24న ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ సిబ్బంది శనివారం ప్లకార్డులు, బ్యానర్లు చేతపట్టి ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ నివారణకు మందులు అందుబాటులో వున్నాయని, రెండు వారాలకు మించి దగ్గు వున్నా, ఆకలి మందగించినా, బరువు తగ్గినా ప్రభుత్వ ఆస్పత్రుల్లో కఫం పరీక్ష చేయించుకోవాలన్నారు. దీని నివారణకు ప్రభుత్వం 6 నెలలపాటు ఉచితంగా మందులు అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సౌభాగ్యమణి, సత్యవతి, టీబీ సూపర్‌వైజర్లు వీరబ్రహ్మ, సురేష్, కృష్ణ, అనూష, తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి



చిట్టివలసలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆటో కార్మికులు



మధురవాడలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తగరపువలస: విప్లవయోధుడు భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా చిట్టివలస ఈఎస్ఐ ఆస్పత్రి, ఎస్ఆర్ఐ కళాశాల వద్ద ఆటో స్టాండ్‌లో కార్మికులు శనివారం ఘనంగా నివాళులర్పించారు. ఆటో కార్మికులు నీలాతి రాము, పల్ల పెంటరాజు, నమ్మి నాయుడు, కోరాడ ఎల్లాజీ, అలబాని కన్నా, నమ్మి శ్రీనివాసరావు, జోగ వెంకటరావు పాల్గొన్నారు.

మధురవాడ: భగత్‌సింగ్ ఆశయ సాధనకు అంతా కృషి చేయాలని సీఐటీయూ మధురవాడ జోన్ నాయకుడు పి.రాజ్‌కుమార్ కోరారు. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతిని శనివారం కొమ్మాది జంక్షన్ వద్ద నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆ మహా యోధులు దేశం కోసం ప్రాణ త్యాగం చేశారని కొనియాడారు. నాయకులు బి.నాగేశ్వరరావు, ఎర్రన్న, వెంకటరావు పాల్గొన్నారు.

తగరపువలస : స్వాతంత్య్ర సమరయోధులు భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు వర్ధంతి సందర్భంగా శనివారం తగరపువలసలో సీపీఐ, చిట్టివలసలో సిటు కార్యాలయాల్లో నివాళులర్పించారు. దేశంలో సోషలిజం సాధనకు యువకులంతా పోరాటం చేయాలన్నారు. సీపీఐ కార్యాలయంలో కానూరి రాంబాబు, అల్లు బాబూరావు, మోర అప్పలరాజు, కొండపు ఈశ్వరరావు, రాంపైడి, మావూరి వీర్రాజు, వానపల్లి సత్యం, నూలు ఆదినారాయణ, అల్లం గోవిందరావు, గిడుతూరి సూరిబాబు, సన్నిబాబు పాల్గొన్నారు. సిటు కార్యాలయంలో రవ్వ నరసింగరావు, ఎస్.శ్రీనివాసవర్మ తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాది: భగత్‌సింగ్ పోరాటాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కొమ్మాది కే1 కాలనీ ప్రెసిడెంట్ అవతార్‌సింగ్ సూచించారు. శనివారం భగత్‌సింగ్ చిత్రపటానికి కాలనీ పెద్దలతో కలిసి నివాళులర్పించారు. జాకబ్, మోహన్‌సింగ్, ప్రతాప్ సింగ్, సూరజ్‌సింగ్ పాల్గొన్నారు.

ఇంటింటా వైఎస్సార్ సీపీ నాయకుల ప్రచారం



ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు

తగరపువలస : జీవీఎంసీ 1, 2 వార్డుల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరుతూ శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఒకటో వార్డు బాలాజీనగర్‌లో పార్టీ వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, చింతగుంట శివ, బంక శ్రీను, నీలాపు రామిరెడ్డి ప్రచారం చేశారు. రెండో వార్డు సత్యనారాయణపేటలో వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు బింగి హరికిరణ్‌రెడ్డి, చిప్పాడ వెంకటేష్, చిల్ల బాబయ్యరెడ్డి, శ్రీరమా సత్యనారాయణ స్వామి ఆలయ చైర్మన్ సరగడ నాగిరెడ్డి, తెడ్లాపు అప్పలరాజు, జగన్నాథ ఎల్లాజీ, కంచుబోయిన వెంకటరావు, చిల్ల గణేష్ రెడ్డి, చేట్ల నరసింగ్‌రెడ్డి, విజయవాడ నాగిరెడ్డి, మునకాల ఆదినారాయణరెడ్డి, శీరపు నరసింహారెడ్డి, జీరు భరత్‌రెడ్డి, మద్ది మహాలక్ష్మి పాల్గొన్నారు

కొమ్మాది: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలకే ఓటు వేద్దాం అంటూ జీవీఎంసీ 4వ వార్డు నిడిగట్టు, ఎస్సీ కాలనీ, నేరెళ్లవలస ప్రాంతాల్లో కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు శనివారం ప్రచారం కొనసాగించారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం సుభిక్షంగా వుంటుందన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు పాల రమణా రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు బోర రామకృష్ణ, బాడిదబోయిన రాములప్పడు, బోర శ్రీనివాస్ రెడ్డి, జగన్నాథ శ్రీనివాస్, బోర రమణారెడ్డి, కోరాడ రాము పాల్గొన్నారు.



బాలాజీనగర్‌లో ప్రచారం చేస్తున్న జగుపల్లి ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు



సత్యనారాయణపేటలో ప్రచారం చేస్తున్న జీరు వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు

బీచ్‌లో వ్యాపారి దౌర్జన్యం

తగరపువలస : భీమిలి మండలం టి.నగరపాలెం ఎంపీటీసీ సభ్యురాలు పల్లా నీలిమ కుటుంబ సభ్యులపై భీమిలి బీచ్‌లో మురీ మిక్స్చర్ వ్యాపారి శనివారం సాయంత్రం దౌర్జన్యానికి దిగాడు. తీరంలో మిగిలిన వ్యాపారులంతా మురీ మిక్స్చర్‌కు రూ.30 వసూలు చేస్తుండగా... చిట్టివలసకు చెందిన వ్యాపారి రూ.100 వసూలు చేస్తుండడంతో నీలిమ భర్త సన్యాసిరావు ప్రశ్నించాడు. దీంతో రెచ్చిపోయిన ఆ వ్యాపారి ఇక్కడ అంతా తన ఇష్టం అంటూ దాడి చేసినట్టు తెలిపారు. పర్యాటకులపై కొందరు చిరు వ్యాపారులు తరచూ ఇలాంటి దాడులు చేస్తున్నా జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని సన్యాసిరావు ఆరోపించాడు.

ఘనంగా కుంకుమార్చన

భీమునిపట్నం: భీమిలిలోని కృష్ణకాలనీ కొండపైనున్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం అష్టలక్ష్మి సామూహిక కుంకుమార్చన అర్చకులు అప్పలాచారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రత్యేక హోమాలు, పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, రేలంగి పెదబాబు, కె.ముత్యాలరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పేదలు, పెత్తందారులకు మధ్యే పోరాటం

- ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు పేదల గెలుపే
- సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన, అభివృద్ధి సాధ్యం
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



పరదేశిపాలెం - 2 కాలనీలో మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు



ప్రచారంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ : సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, అభివృద్ధి జరగాలన్నా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డినే మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం వుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ మధురవాడ జోన్ బోయిపాలెం సమీపంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం పీపీ - 2 కాలనీలో శనివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేసి, ప్రభుత్వం ద్వారా జరిగిన మేలు, అభివృద్ధిని వివరించి ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల జీవితాలు బాగుపడాలంటే సీఎం జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, పెత్తందార్లు కోసమైతే చంద్రబాబు రావాలని చెప్పారు. ప్రస్తుత ఎన్నికలు పేదలు, పెత్తందారులకు మధ్య పోరాటమని, ఇందులో వైఎస్సార్‌సీపీని గెలిపించి పేదలు గెలవాలని కోరారు. జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల్లో గెలిచిన తర్వాత రెండోసారి ముఖ్యమంత్రిగా విశాఖ నుంచే పరిపాలన ప్రారంభిస్తారని, తద్వారా ఈ ప్రాంతం అభివృద్ధి చెందడంతోపాటు ఉపాధి, ఉద్యోగ, విద్యా అవకాశాలు మెరుగవుతాయన్నారు. చంద్రబాబు ఎంత మందితో కలిసి వచ్చినా మళ్లీ ఎగిరేది వైఎస్సార్‌సీపీ జెండాయేనని చెప్పారు. ఎన్నికలు వచ్చిన తర్వాతనే టీడీపీ, దాని జట్టు పార్టీలకు ప్రజలు గుర్తుకు వస్తారన్నారు. వారి బెదిరింపులు, ప్రలోభాలకు ఎవ్వరూ గురికావద్దని కోరారు. వారు చెప్పే అలవికాని హామీలు కూడా ఎవ్వరూ పట్టించుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు, సాంస్కృతిక విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ వంకాయల మారుతీ ప్రసాద్, జేసీఎస్ కన్వీనర్ పోతిన సురేష్, నాయకులు జేఎస్ రెడ్డి, బండారు శివలక్ష్మి, గాయత్రి, సూర్రెడ్డి, లక్ష్మి, ఉమాదేవి, అప్పలనాయుడు, రాజు, రాంబాబు, బోయి సుజాత, చేకూరి రజని, పిల్లా సూరిబాబు పాల్గొన్నారు.



యువకులకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సంగివలస చెరువు చుట్టూ దుర్వాసన



చనిపోయి సంగివలస చెరువులో తేలిన చేపలు



చనిపోయిన చేపలను చెరువు గట్టుపై పడేసిన దృశ్యం



చెరువు నలుమూలలా ప్లాస్టిక్ వ్యర్థాలే

గట్టుపై చనిపోయిన చేపలు పడేయడంతో దుర్గంధం

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డు సంగివలస కొండప్ప చెరువులో చేపలు మృతిచెంది నీటిపై తేలుతుండడంతో స్థానికులు దుర్వాసన భరించలేకపోతున్నారు. మూడు రోజులుగా వందల కొద్దీ చనిపోతున్న చేపలను మత్స్యకారులు చెరువు నుంచి తొలగించి ఒడ్డున పడేస్తున్నారు. దీంతో చెరువు చుట్టూ వాకింగ్‌కు వచ్చేవారు ముక్కు మూసుకుని వెళ్తున్నారు. చెరువుకు ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో లేకపోవడంతో అందులో నీరు అడుగంటి ఎండలకు తాళలేక చేపలు మృత్యువాత పడుతున్నాయని వాకర్లు అంటున్నారు. చనిపోయిన చేపలను డంపింగ్‌యార్డుకు తరలించడమో, పూడ్చడమో చేయకుండా గట్టుపై కుప్పలుగా పడేయడంతో బ్యాక్టీరియా వృద్ధి చెందుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువును ఆనుకుని ముగ్గురు అమ్మవార్ల ఆలయ వార్షికోత్సవాలు ఆదివారం నుంచి జరుగుతున్నందున వేలాది మంది భక్తులు దర్శనాలకు వస్తారు. వారందరినీ ఈ దుర్గంధం సమస్య వేధించే ప్రమాదం ఉందని వాపోతున్నారు. జీవీఎంసీ, మత్స్యశాఖ సిబ్బంది జోక్యం చేసుకుని చనిపోయిన చేపలను చెరువు నుంచి, గట్టు పైనుంచి సేకరించి దూరంగా తరలించాలని కోరుతున్నారు. అలాగే చెరువు చుట్టూ తేలిన తెట్టును తొలగించకపోతే దుర్వాసన మరింతగా వ్యాపించి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అతిసారానికి గురయ్యే ప్రమాదం ఉందని వాపోతున్నారు.

'అవంతి'లో ముగిసిన వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో విద్యార్థులతో నిర్వాహకులు

తగరపువలస : చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రింట్ - 2 లెర్న్ వర్క్‌షాప్ శనివారం ముగిసింది. మెకా మార్విస్ స్టూడెంట్స్ క్లబ్ నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆర్పీ ఎల్.భవానీ శంకర్ ఎఫ్‌డీఎం 3డీ ప్రింటింగ్ ప్రాముఖ్యత వివరించారు. విద్యార్థులు జ్ఞానం అభివృద్ధి చేసుకుని భవిష్యత్‌లో మంచి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. కన్వీనర్ అవినాష్ బెన్, ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్, ఎం.లక్ష్మి శ్రామిక్ పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికతో చదివితే లక్ష్య సాధన

విశ్రాంత రియర్ అడ్మిరల్ రవికిరణ్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న రవికిరణ్

మధురవాడ: మధురవాడ గాయత్రి విద్యా పరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవం శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి హాజరైన ఇండియన్ మారిటైమ్ బోర్డు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ పూర్వ సభ్యులు, విశ్రాంత రియర్ అడ్మిరల్ కె.రవికిరణ్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికతో చదివి లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ గో స్వామి, తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాది: రుషికొండలో గల గాయత్రి విద్యా పరిషత్ క్యాంపస్ ఓపెన్ ఆడిటోరియంలో ద్వారకా నగర్, ఎంవీపీ కాలనీ గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాలల వార్షికోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి ఎన్ఎస్‌టీఎల్ డీఎస్ అండ్ డీజీఎన్ఎస్ఎమ్ (రక్షణ మంత్రిత్వ శాఖ అధికారి) వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి భారతదేశం భవితకు బాటలు వేసేలా ఎదగాలని, క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. కొత్త ఆలోచనలతో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ప్రొఫెసర్ పి.సోమరాజు, ప్రిన్సిపల్ రజిని, పీవీ శర్మ పాల్గొన్నారు.